# శుద్ధ జలం.. పచ్చి అబద్ధం



ట్యాంకర్ ద్వారా నీటిని విక్రయిస్తున్న దృశ్యం



**శుద్ధ జలం ఉత్త అబద్ధమే.. ఎలాంటి మినరల్స్ లేకుండానే నేరుగా బోరు నీటిని అందిస్తూ వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు అడ్డగోలుగా వ్యాపారం చేస్తున్నారు. మడకశిర నియోజకవర్గంలో 17 వాటర్ ప్లాంట్లకు అనుమతి ఉండగా అనుమతి లేకుండా అధిక సంఖ్యలో వాటర్ ప్లాంట్లు నడుస్తున్నాయి. బోరు వాటర్‌ను మినరల్ వాటర్‌గా మార్చేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించకనే యథేచ్ఛగా వ్యాపారాన్ని కొనసాగిస్తూ జేబులు నింపుకుంటున్నారు.**

- మినరల్ వాటర్ పేరుతో వాటర్ ప్లాంట్ నిర్వాహకుల దందా
- నాణ్యతకు తిలోదకాలిచ్చి వ్యాపారం
- పట్టించుకోని అధికారులు

రొళ్ల: మడకశిర నియోజకవర్గంలో ప్రైవేట్ వాటర్ ప్లాంట్ నిర్వాహకుల దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. వివిధ గ్రామాల్లో వాటర్ స్కీమ్ పథకంలో వచ్చే నీళ్లు కేవలం అవసరాలకు మాత్రమే ప్రజలు ఉపయోగిస్తున్న నేపథ్యంలో దీన్నే ఆసరగా చేసుకున్న వాటర్ ప్లాంట్ యజమానులు ఇష్టానుసారంగా నీళ్ల అమ్మకాలు సాగిస్తున్నారు. వాటర్ స్కీమ్ పథకం ద్వారా అందుతున్న నీళ్ల పైప్‌లైన్ లీకేజీ, ఫ్లోరైడ్ నీళ్లు సరఫర అవుతుండటంతో ప్రజలు గత్యంతరం లేక వాటర్ ప్లాంట్ నీటిని ఆశ్రయిస్తున్నారు. కొందరు నామమాత్రంగా వాటర్ ప్లాంట్‌లకు అనుమతులు తీసుకుని దోపిడీ చేస్తున్నారు.

**క్యాన్‌కు రూ. 25**

ప్రస్తుతం గ్రామాలకు ప్రైవేటు వాహనాల ద్వారా మినీ ట్యాంకులు అమర్చుకొని నీటిని సరఫరా చేస్తూ 20 లీటర్ల క్యాన్ వాటర్‌కు రూ.20 నుంచి రూ.25, ఒక బిందెకు రూ.10 నుంచి రూ.15 వరకు



రొళ్లలోని వాటర్ ప్లాంట్

వసూలు చేస్తున్నారు. అయితే సంబంధితశాఖ అధికారులు మాత్రం ఎక్కడా కూడా దాడులు నిర్వహించి పరిశీలించిన దాఖలాలు మాత్రం లేవు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చిన ఆహార భద్రత చట్టంలో వాటర్ ప్లాంట్లలో నిబంధనలు పాటించడంతో పాటు తప్పని సరిగా ఐఎస్ఐ గుర్తింపు పొంది ఉండాల్సి ఉంది. ప్రతినెల సంబంధితశాఖ అధికారులు తనిఖీలు చేయాల్సి ఉంది. నాణ్యత పాటించని ప్లాంట్‌లను రద్దు చేయాల్సి ఉంది. అయితే ఉన్నతాధికారులు ఎవరూ పట్టించుకోకపోగా... స్థానికంగా ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్, రెవెన్యూ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు కూడా వాటర్ ప్లాంట్లను

| వాటర్ ప్లాంట్ల వివరాలు | |
|---|---|
| మండలం | వాటర్ ప్లాంట్ల సంఖ్య |
| రొళ్ల | 4 |
| అగళి | 2 |
| గుడిబండ | 2 |
| అమరాపురం | 3 |
| మడకశిర | 6 |

పరిశీలించకపోవడంపై సర్వత్రా విమర్శలొస్తున్నాయి.

**నిబంధనలకు తూట్లు..**

రొద్దం మండలంలో నాలుగు వాటర్‌ప్లాంట్లు ఉన్నాయి. ఆయా వాటర్ ప్లాంట్ల ద్వారా నుంచి మినీ వాహనాల్లో చిన్నపాటి వాటర్ ట్యాంకులు అమర్చుకుని గ్రామీణ ప్రాంతాల్లో తిప్పుతు నీళ్ల విక్రయిస్తు సొమ్ము చేసుకుంటున్నారు.ఇదే రీతిలో నియోజకవర్గంగా అధికారికంగా ఉన్నవి కొన్నైతే అనధికారిక వాటర్ ప్లాంట్లకు లెక్కేలేదు.

### శుద్ధి చేయని నీటితో అనారోగ్యం



వాటర్ ప్లాంట్ల నిర్వాహకుల నీటి దోపిడీని అరికట్టాలి. చాలా మంది నాణ్యతలేని నీటిని సరఫరా చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. నాణ్యత లేని నీటి సరఫరా చేయడం ద్వారా అనారోగ్యం పాలవడం ఖాయం. అధికారులు చర్యలు తీసుకుని స్వచ్ఛమైన నీటిని సరఫర చేయడం కోసం చర్యలు తీసుకోవాలి. గ్రామాల్లో నిరుపయోగంగా ప్రభుత్వ వాటర్ ప్లాంటును బాగు చేయాలి.

– నాగరాజు, టీడీ పల్లి గ్రామం, రొళ్ల మండలం

### వాటర్‌ప్లాంట్లను తనిఖీ చేయాలి



నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాటర్ ప్లాంట్లపై అధికారులు దాడులు నిర్వహించాలి. అసలు నాణ్యమైన నీటిని సరఫరా చేస్తున్నారో లేదో పరిశీలించారు. సక్రమంగా లేని విధంగా ఉంటే అలాంటి ప్లాంట్ల అనుమతలు రద్దు చేయాలి. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు స్పందించాలి.

– శ్రీనివాస్, హెచ్‌టీ హళ్లి, రొళ్ల మండలం

### అనుమతి లేకపోతే చర్యలు



వాటర్ ప్లాంట్లను నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తే తనిఖీ చేసి అనుమతులు లేనివని తేలితే రద్దు చేస్తాం. ప్రజల నుంచి ఫిర్యాదు వస్తే దాడులు చేస్తాం. వాటర్ ప్లాంట్‌కు పట్టణ, పంచాయతీ అధికారుల అనుమతులు, ఐఎస్ఐ ధ్రువీకరణ పత్రం తప్పని సరి. నిబంధనలు విరుద్ధంగా ఏర్పాటు చేసుకున్న వాటర్ ప్లాంట్ పై నివేదికలు తయారు చేసి అనుమతి రద్దు కోసం సబ్‌కలెక్టర్‌కు నివేదిస్తాం.

– షేక్షావలి, ఇన్‌చార్జ్ తహసీల్దార్, రొళ్ల

## క్లుప్తంగా

### బాధిత కుటుంబానికి పరామర్శ



నరసప్ప మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న దీపిక

లేపాక్షి: మండలంలోని నాయనిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రామాంజినప్ప తండ్రి నరసప్ప అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎస్.దీపిక.. ఆ గ్రామానికి చేరుకొని నరసప్ప మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

### ఆలయాభివృద్ధికి రూ.లక్ష విరాళం



విరాళాన్ని అందిస్తున్న రామానందన్

లేపాక్షి: మండలంలోని రాజీవ్‌కాలనీ వెలిసిన దొండమారమ్మ దేవాలయం అభివృద్ధికి లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈమేరకు ఆలయ కమిటీ సభ్యులకు మంగళవారం ఆ డబ్బును అందించారు.

### ఆరోగ్య సూత్రాలపై అవగాహన



నీలకంఠాపురంలో రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజువాణి

మడకశిరరూరల్: మండల పరిధిలోని కల్లుమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజువాణి తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం కల్లుమర్రి, నీలకంఠాపురం పీహెచ్‌సీల్లో జరిగిన ఆశా డై కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గర్భిణులు, చిన్న పిల్లల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

### అగ్నికి ఆహుతైన పండ్ల తోట



హిందూపురం అర్బన్: మండలం పరిధిలోని కొటిపి రోడ్డుకు ఆనుకొని ఉన్న తోటకు ఆకతాయిలు సోమవారం రాత్రి నిప్పు పెట్టారు. దీంతో మూడు ఎకరాల్లో ఉన్న మామిడి, నేరేడు, టెంకాయ చెట్లు, డ్రిప్ పరికరాలు అగ్నికి ఆహుతైనట్లు బాధిత రైతు చైతన్య భార్గవ్ ఆవేదన వ్యక్తం చేశారు. రూ.2 లక్షలు నష్టం వాటిల్లిందని రెవెన్యూ అధికారులు ఆదుకోవాలని కోరారు.

### పుట్టమన్నుతో శివలింగాలు



పుట్టమన్నుతో శివలింగాలు తయారు చేస్తున్న మహిళలు

హిందూపురం: వీరశైవ సంఘం అక్కమహాదేవి మహిళా సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని బసవేశ్వరాలయంలో పుట్టమన్నుతో ఐదు వేల శివలింగాలను తయారు చేస్తున్నారు. ఈనెల 26న నిర్వహించిన మహాశివరాత్రి వేడుకల్లో ప్రత్యేక పూజల కోసం శివలింగాలు తయారు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

### వీర జవాన్‌కు నివాళి



చంద్రశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజలు

లేపాక్షి: మండలంలోని కోడిపల్లికి చెందిన జవాన్ చంద్రశేఖర్‌రెడ్డి 15 ఏళ్ల క్రితం దేశసేవలో వీర మరణం పొందారు. ఆయన వర్ధంతి సందర్భంగా మంగళవారం ఉదయం చంద్రశేఖర్‌రెడ్డి మిత్ర మండలి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. బస్టాండు దగ్గర ఏర్పాటు చేసిన ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి సేవలు గుర్తు చేసుకున్నారు.

### నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

మడకశిర: నియోజకవర్గంలోని ఇంటర్ ఒకేషనల్ విద్యార్థులకు బుధవారం నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను విద్యాశాఖ అధికారులు పూర్తి చేశారు. నియోజకవర్గంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో 841 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఈనెల 15 వరకు మూడు విడతల్లో పరీక్షలు జరగనున్నాయి. ఎంపీసీ, బైపీసీ చదువుతున్న విద్యార్థులకు ఈనెల 10 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు.

### రోడ్డుపై మురుగు తొలగింపు



మురుగునీటిని తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

అగళి: 'రోడ్డుపై మురుగు' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. ఈఓఆర్డీ పద్మ, పంచాయతీ కార్యదర్శి రంగనాథ్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో రోడ్డుపై పారుతున్న మురుగు నీటిని పారిశుధ్య కార్మికులతో మంగళవారం శుభ్రం చేయించారు. స్థానికులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

### నట్టల నివారణకు వ్యాక్సిన్

మడకశిరరూరల్: మండల పరిధిలోని జమ్మానిపల్లిలో మంగళవారం పశు వైద్య సిబ్బంది గొర్రెలు, మేకలకు వ్యాధులు సక్రమించకుండా వ్యాక్సిన్ వేశారు. అలాగే సులి పురుగుల నివారణకు డీ వార్మింగ్ మందును కాపర్లకు అందజేశారు. వ్యాధుల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. పశు వైద్య అసిసెంట్లు వెంకటేష్, నటరాజు, భరత్‌ప్రసాద్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

### వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రశేఖరనాయుడు

అగళి: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో మంగళవారం సరస్వతీ పూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సరస్వతీదేవి విగ్రహం వద్ద పుస్తకాలు ఉంచి పూజలు చేశారు. ఎంఈఓ చంద్రశేఖరనాయుడు, ప్రిన్సిపాల్ మహమ్మద్ జాఫార్ మాట్లాడుతూ ఇంటర్, పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చదువుకోవాలన్నారు

## సూపర్ సిక్స్ కాదు.. సూపర్ 'ఫ్లాప్'

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



మాట్లాడుతున్న సమన్వయకర్త ఈరలక్కప్ప

రొళ్ల: 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసగించింది. సూపర్ సిక్స్ పథకాలను సూపర్ ఫ్లాప్ చేశారు. మళ్లీ రాష్ట్రం సంక్షేమ పథకాలతో కళకళలాడాలంటే వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితే అది సాధ్యమవుతుంది' అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని రొళ్లకొండ శివాలయం ఆవరణలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి అధ్యక్షతన మండల స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈరలక్కప్ప మాట్లాడుతూ ఉచిత బస్సు, రైతులకు పెట్టుబడి సాయం, నిరుద్యోగ భృతి, యువతకు ఉపాధి, మహిళలకు రూ.1500, ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇలా ఏ పథకాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందారని గుర్తు చేశారు. పేదలకు అన్ని రకాల సేవలు అందాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాల్సిందేనన్నారు. గ్రామాల్లో ప్రతి కార్యకర్త కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండ గట్టి ప్రజలకు అండగా ఉండాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని భరోసా కల్పించారు. గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కూడా కృషి చేయాలన్నారు. త్వరలోనే మండల వారీగా అనుబంధ పదవులు కేటాయిస్తామని పేర్కొన్నారు. త్వరలోనే మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాలూకాల వారీగా పర్యటిస్తారని, ఆ లోపు క్యాడర్‌ను సిద్ధం చేసుకొందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కుంచిటిగ అనుబంధ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రంగేగౌడు, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి , వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ తిమ్మప్ప, జిల్లా కార్యదర్శి లోకేష్, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు సంతోష్, ఎంపీపీ భర్త విజయరంగేగౌడు, నాయకులు గోవిందప్ప, నగేష్‌రంగారెడ్డి, నగేష్‌గౌడ, సన్నమారప్ప, చిక్కన్న, దొడ్డయ్య, యంజారప్ప, ప్రకాష్, రాజప్ప, దేవరాజు, యరగుంటప్ప, సీఎం ఘట్ట రవి, శ్రీనివాస్, శ్రీధర్, వజీర్‌సాబ్, జగదీష్, రవికుమార్, కరేగౌడ, మహంతేష్, ముద్దారెడ్డి పాల్గొన్నారు.

### జాగ్రత్తలతోనే కేన్సర్‌కు చెక్

హిందూపురం టౌన్: ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారానే కేన్సర్‌కు చెక్ పెట్టొచ్చని ఎస్ఎస్ పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశులు అన్నారు. మంగళవారం స్థానిక కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగము, రెడ్ రిబ్బన్ క్లబ్, జంతుశాస్త్ర విభాగం సంయుక్తంగా ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి, యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా ఆరోగ్య సమాజాన్ని నిర్మించుకోవాలన్నారు.

## సంక్షిప్త సమాచారం

**మార్చి 8న మెగా లోక్ అదాలత్**

హిందూపురం అర్బన్: పట్టణంలోని స్థానిక కోర్టు ఆవరణంలో మార్చి 8న మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా అదనపు జడ్జి కంపల్లె శైలజ తెలిపారు. రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవచ్చని సూచించారు. సివిల్ కేసులతో పాటు రాజీ కాదగిన క్రిమినల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, భరణం కేసులు, బ్యాంక్ రుణాల కేసులు పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. కక్షదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు కృషి**

మడకశిర: విద్యార్థుల్లో వివిధ రకాలుగా నైపుణ్యాన్ని పెంచడానికి కృషి చేస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఈడీపీ (ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం)ని ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**నేటి నుంచి కెంచమాంబదేవి ఉత్సవాలు**

అమరాపురం: మండల పరిధిలోని గౌడనకుంటలో వెలసిన కెంచమాంబదేవి పెద్ద జాతర ఉత్సవాలు బుధవారం నుంచి ఈ నెల 13వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు లింగరాజు, వీరలింగప్ప, సిద్దప్ప, ఈశ్వరప్ప, నింగణ్ణ తదితరులు తెలిపారు. ముఖ్యంగా 5న నూతన ఆలయ ప్రవేశం, 7న విగ్రహ ప్రాణ ప్రతిష్టాపన, 10న జలధి ఉత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

**పోస్టర్లు విడుదల**

మడకశిర: ఎస్సీ వర్గీకరణ కోసం ఈనెల 7న తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు, వెయ్యి గొంతులు ర్యాలీ విజయవంతం చేయాలని కోరుతూ మడకశిరలో ఎంఈఎఫ్ నాయకులు మంగళవారం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భూతన్న, జిల్లా కార్యదర్శి మాలింగప్ప, సీనియర్ నాయకులు రంగస్వామి, అధ్యక్షుడు రంగనాథ్, కోశాధికారి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

**నీటి సమస్య పరిష్కారం**

హిందూపురం అర్బన్: హిందూపురం మండలం తూముకుంటలో మంచి నీటి బోరు మోటారు చెడిపోవడంతో నీటి సమస్య ఏర్పడింది. స్పందించిన గ్రామ కార్యదర్శి కెంచరాయప్ప మంగళవారం సర్పంచ్ రత్నమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల సహకారంతో పంప్ సెట్‌కు మరమ్మతు చేయించడంతో నీటి సమస్య పరిష్కారమైంది.

**బలవర్ధక ఆహారం ముఖ్యం**



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

హిందూపురం టౌన్: శరీర అభివృద్ధి, ఎదుగుదలకు బలవర్ధకమైన ఆహారంతో పాటు సూక్ష్మ పోషకాలు కూడా ముఖ్యమని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని స్థానిక లక్ష్మీపురం ఆరోగ్య కేంద్రంలో నిర్వహించే ఆశాడే సమావేశంలో ఆయన పాల్గొని పలు సూచనలు, సలహాలిచ్చారు. సీఓ ముస్తఫా, ఫార్మసిస్ట్ శ్రీనివాసరెడ్డి, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

**'నిరంతర జ్యోతి' ఇవ్వండి**

పావగడ: తాలూకాలోని కొత్తూరు దాసప్పనహట్టిలో సుమారు 15 ఇళ్లకు చాలా కాలం నుంచి నిరంతర జ్యోతి పథకం కింద అందించే విద్యుత్ సరఫరా ఇవ్వడం లేదని, వెంటనే నిరంతర జ్యోతి విద్యుత్ సరఫరా చేయాలని స్థానిక కర్ణాటక రైతు సంఘం అధ్యక్షుడు పూజారప్ప డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక బెస్కాం విద్యుత్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన నిర్వహించారు.

**వీరభద్రుడి సేవలో విశ్రాంత న్యాయమూర్తి**

లేపాక్షి: స్థానిక వీరభద్రస్వామి ఆలయాన్ని పాట్నా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి వికాస్‌జైన్ మంగళవారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమాందన్, అర్చకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆలయంలోని శిల్పాలు, చిత్రలేఖనాలు తిలకించి ఆనందం వ్యక్తం చేసారు.

**పోలీసులకు సహకరించండి**

అమరాపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో పాడి ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకల పెంపకందారులు జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ ఇషాక్‌బాషా తెలిపారు. పశువులు అపహరణకు గురికాకుండా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో కొత్తగా వచ్చిన అనుమానస్పద వ్యక్తుల కదలికలపై పోలీసులకు సమాచారమిచ్చి సహకరించాలన్నారు.

**ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై విచారణ**

రొద్దం: మండల పరిధిలోని సానిపల్లిలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై మంగళవారం పుట్టపర్తి డీఎస్పీ ఆదినారాయణ విచారణ చేపట్టారు. ఇటీవల సినిమా సంబరాల్లో బాణాసంచ కాల్చే విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. దీంతో దళితులు ఓ వర్గంపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టినట్లు వివరించారు.

**ఈక్రాప్ బుకింగ్ చేసుకోండి**

పరిగి: రబీ సీజన్‌లో సాగు చేసిన ప్రతి రైతూ తప్పని సరిగా ఈక్రాప్ బుకింగ్‌ను ఈనెల 15 లోపే చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి విజయ భారతి తెలిపారు. మండలంలోని హొన్నంపల్లి, పీ నరసాపురం గ్రామాల పరిధిలో మంగళవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు.

## భక్తిశ్రద్ధలతో రథసప్తమి



మడకశిర: అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు



మెళవాయిలో జ్యోతులను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు



నీలకంఠాపురంలో సూర్య నమస్కారాలు చేస్తున్న దృశ్యం



రొళ్ల మండలం టీడీ పల్లిలో జ్యోతులు మోస్తున్న మహిళలు



అగళి మండలం హనుమనపల్లిలో మహాలక్ష్మీదేవిని ఊరేగిస్తున్న దృశ్యం

సాక్షిబృందం: రథ సప్తమి వేడుకల్లో భాగంగానే హిందూపురం, పెనుకొండ, మడకశిరలోని వివిధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే ఆయా ప్రాంతాల్లోని స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొన్ని ప్రాంతాల్లో ఉత్సవ మూర్తులను భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. మరికొన్ని చోట్ల రథోత్సవాలను కన్నుల పండువగా నిర్వహించారు.

**పేట వెంకటరమణస్వామి ఉత్సవాలు ప్రారంభం**

హిందూపురం: హిందూపురం మెయిన్ బజారులోని పేట వెంకటరమణస్వామి బ్రహ్మరథోత్సవ కార్యక్రమాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. శ్రీదేవి భూదేవి సమేత వెంకట రమణస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. 12వ తేదీన స్వామివారి బ్రహ్మ రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



గుడిబండ మండలం హీరేతుర్పిలో ఆంజినేయస్వామి రథోత్సవం



హిందూపురం: అలంకరణలో పేట వెంకటరమణ స్వామి



హిందూపురం: అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



పావగడ: సుబ్రహ్మణ్యస్వామి



అమరాపురం: కెంచమాంబదేవి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు